## ఆదివాసీ ఉప తెగలకు నామినేట్ పోస్టులు ఇవ్వాలి

మాట్లాడుతున్న తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్

ఎదులాపురం, జూలై 14 : కాంగ్రెస్ ప్రభుత్వం ఆదివాసీ ఉప తెగలకు నామినేట్ పోస్టులు ఇవ్వాలని తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్ అన్నారు. ఆదివారం ఆదిలాబాద్‌లోని పాత అంబేద్కర్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఐటీడీఏ చైర్మన్ పదవి మిగతా ఆదివాసీ తెగకు కేటాయించాలని కోరారు. సమావేశంలో తుడుందెబ్బ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు నైతం రమేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు రామెల్లి భోజన్న, సోయం రాందాస్, కుంచం గంగాధర్, జిల్లా కార్యదర్శి ముకుంద్‌రావ్ పాల్గొన్నారు.

## నేడు కలెక్టరేట్ ఎదుట బీడీ కార్మికుల ధర్నా

మాట్లాడుతున్న వెంకటనారాయణ

ఎదులాపురం, జూలై 14 : తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట చేపట్టే బీడీ కార్మికులు ధర్నాను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు బీ వెంకటనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కుమ్రం భీం భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీడీ కార్మికులకు చేయూత పథకం కింద రూ.4వేలు ఇవ్వాలన్నారు. కనీస వేతనం జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాకు కార్మికులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు. సమావేశంలో నాయకులు కళావతి, గంగమ్మ, తారాబాయి పాల్గొన్నారు.

## ఉద్యోగ విరమణ సహజమే

రాథోడ్ బాబులాల్ దంపతులను సన్మానిస్తున్న సొసైటీ సభ్యులు

బోథ్, జూలై 14 : ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమేనని జై సావాలాల్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు అన్నారు. ఆదివారం వైద్యారోగ్య శాఖలో ఉత్తమ సేవలు అందించి ఉద్యోగ విరమణ పొందిన రాథోడ్ బాబులాల్ దంపతులను శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గ్రామస్తులు, వెల్ఫేర్ సొసైటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

జైనథ్, జూలై 14 : మండలంలోని మేడిగూడ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అక్తార్ తల్లి జైరాభి ఆదివారం అనారోగ్యంతో మృతి చెందింది. బాధిత కుటుంబ సభ్యులను డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి పరామర్శించారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్ రెడ్డి, గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

TOURS & TRAVELS

★మహాదేవ టూర్స్: 6th నవంబర్-కార్తీక మాసంలో కాశీ+12 క్షేత్రాలు. Ac Bus 20 స్లీపర్+20 సిట్టింగ్ 15 రోజులు. చార్‌ధాం 20th, సెప్టెంబర్ 3rd Ac. సంప్రదించండి: 9676637578.
NT-339536

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

# మోడల్ స్కూల్‌కు మహర్దశ

- పీఎం శ్రీ పథకానికి ఎంపిక
- రూ. 2 కోట్లతో ఆధునిక వసతులు
- కుంటాలలోని ఆదర్శ పాఠశాలలో ప్రారంభమైన పనులు

కుంటాలలోని ప్రభుత్వ మోడల్ స్కూల్, కళాశాల భవనం

కుంటాల, జూలై 14 : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం శ్రీ (ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైసింగ్ ఇండియా) పథకానికి కుంటాల మండలం నుంచి ప్రభుత్వ ఆదర్శ పాఠశాల ఎంపికైంది. దరఖాస్తు చేసుకున్న తర్వాత పాఠశాలను అప్రూవల్ అథారిటీ అయిన జిల్లా విద్యాధికారి నేతృత్వంలో అధికారులు భౌతికంగా సందర్శించి నిర్దేశిత ప్రమాణాలు ఉన్నాయో లేదో పరిశీలించిన తర్వాతనే ఎంపిక చేస్తారు. ఐదేళ్ల కాలంలో దశలవారీగా రూ. 2 కోట్ల నిధులు ఈ పాఠశాల అప్ గ్రేడేషన్‌కు వెచ్చించనున్నారు.

### స్మార్ట్ తరగతి గదులు

కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌లు, గ్రంథాలయాలు, ఇంటర్నెట్ సదుపాయం స్మార్ట్ తరగతి గదులు, ఆర్ట్ రూమ్‌లు, విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ, వృత్తి విద్య కోర్సులు నైపుణ్యాభివృద్ధి వంటి వాటికి నిధులను కేటాయిస్తారు. స్కూల్ దశ నుంచి వోకేషనల్ కోర్సులను ప్రోత్సహిస్తారు. విద్యార్థి డిగ్రీ వచ్చే సరికి ఏదో ఒక రూపంలో ఉపాధి పొందేలా తీర్చిదిద్దాలన్న నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ -2020 (ఎన్ఈపీ)కి అనుగుణంగా ఈ పథకాన్ని రూపొందించారు. స్కూల్‌ను పర్యావరణ అనుకూల గ్రీన్ స్కూల్‌గా మార్చాల్సి ఉంటుంది. పాఠశాలలో సోలార్ ఫ్యాన్లు, ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేస్తారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి స్వయంగా సేంద్రీయంగా కూరగాయలు, ఆకుకూరలు పండించాలి పాఠశాలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలి. వేస్ట్ మేనేజ్‌మెంట్ నీటి నిర్వహణ చేయాల్సి ఉంది. పర్యావరణ పరిరక్షణ కోసం సాంప్రదాయ విధానాలను విద్యార్థులకు నేర్పించాలి, ప్రస్తుతానికి పలు మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. ఈ విద్యా సంవత్సరానికి ప్రస్తుతం పాఠశాలలో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం వరకు చదువుతున్న 834 మంది విద్యార్థులు ప్రయోజనం పొందనున్నారు.

### విద్యార్థులను నైపుణ్యంగా తీర్చిదిద్దుతాం

పీఎం శ్రీ పథకానికి మా పాఠశాల ఎంపిక కావడం సంతోషకరం. కొన్ని పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలతో విద్య అందనుంది. ఈ వసతులను ఉపయోగించి విద్యార్థులను నైపుణ్యంగా తీర్చిదిద్దుతాం.

-శ్రీనివాస్ ప్రసాద్, ప్రిన్సిపాల్ ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాల, కుంటాల

### సద్వినియోగం చేసుకోవాలి

నిర్మల్ జిల్లాలో మొదటి దశలో 17 ప్రభుత్వ పాఠశాలలో పీఎం శ్రీ పథకం కింద ఎంపిక అయినవి. దీనికి సంబంధించిన పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. రెండవ దశలో 3 స్కూళ్లు ఎంపికయ్యాయి. గ్రామీణ విద్యార్థులకు ఆధునిక పద్ధతులతో విద్యను అందించనున్నాం. కావున విద్యార్థులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి. దశలవారీగా ఈ స్కూళ్లు అప్‌గ్రేడ్ అవుతాయి.

-రవీందర్ రెడ్డి, డీఈవో, నిర్మల్ జిల్లా

# ప్రమాదకరంగా కల్వర్టు

నార్నూర్, జూలై 14 : బొప్పాపూర్ గ్రామ సమీపంలోని లోలెవల్ కల్వర్టు వర్షానికి కోతకు గురై ప్రమాదకరంగా మారిందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రధాన రహదారి గుండా నిత్యం వందల సంఖ్యలో వాహనల రాకపోకలు కొనసాగుతుంటాయి. మూలమలుపు ఉండడంతో వాహన చోదకులకు ఈ కల్వర్టు కనిపించడం లేదు. పెద్ద గుంత ఏర్పడడంతో పెద్ద వాహన చోదకులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. ప్రయాణంలో ఏ కొంత ఆదమర్చిన వాహనలు బోల్తాపడి ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. రాత్రివేళ గుంత కనిపించడం లేదంటూ వాపోతున్నారు. ఇప్పటికైన ఆర్‌అండ్‌బీశాఖ అధికారులు స్పందించి కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

బొప్పాపూర్ గ్రామ సమీపం వద్ద వర్షానికి కోతకు గురైన కల్వర్టు

## మొక్కలు పంపిణీ

మొక్కలు పంపిణీ చేస్తున్న మెప్మా సిబ్బంది

బైంసా, జూలై 14 : పట్టణంలోని 3, 5, 18 వార్డుల్లో ఆదివారం వన మహోత్సవంలో భాగంగా మున్సిపల్ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెప్మా టీఎంసీ దత్తాత్రి, సీవోలు వెంకటేశ్, ముజమ్మిల్, ఆర్పీలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రవికిరణ్ యాదవ్ జన్మదిన వేడుకలు

ఎదులాపురం: కేక్‌కట్ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

ఎదులాపురం, జూలై 14 : సాయివైకుంఠ ట్రస్ట్ చైర్మన్, ప్రముఖ హోమియోపతి డాక్టర్ రవికిరణ్ యాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆదివారం ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచిత మగ్గం, టైలరింగ్ శిక్షణ 9వ బ్యాచ్‌ను ప్రారంభించారు. ముందుగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి రఘువీర్‌యాదవ్ కేక్ కట్ చేసి తినిపించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి రఘువీర్ యాదవ్ మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధిలో రాణించేల సాయివైకుంఠ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు ఎనిమిది బ్యాచ్‌లకు ఉచితంగా మగ్గం, టైలరింగ్ శిక్షణ అందించామని తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు సల్ల విజయ్ బాబు, గట్టయ్య, భీమన్న, శిక్షకురాలు శ్రావణి, రాథోడ్ పూజ, ఓరుగంటి వీణ, పూజిత, మీనా పాల్గొన్నారు.

తాంసి: కేక్ కట్ చేసి తినిపించుకుంటున్న యాదవులు

తాంసి, జూలై 14 : మండల కేంద్రంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ రవికిరణ్ యాదవ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. యాదవులు కేక్ కట్ చేసి ఒకరినొకరు తినిపించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు నరేశ్ యాదవ్, రామన్న యాదవ్, కాడిగిరి వీరేశ్ యాదవ్, శరత్ యాదవ్, గంభీర్, నవీన్, సురేశ్, నరేశ్ పాల్గొన్నారు.

తలమడుగు, జూలై 14: సాయిలింగి వృద్ధాశ్రమంలో వైకుంఠ ట్రస్ట్ చైర్మన్, ప్రముఖ వైద్యులు రవికిరణ్ యాదవ్ జన్మదిన వేడుకలు ట్రస్ట్ సభ్యులు, యాదవ సంఘం సభ్యులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ఒకరినొకరు తినిపించుకున్నారు. అనంతరం వృద్ధులకు అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు రమేశ్, డైరెక్టర్లు కావటి రమేశ్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, ఆశన్న యాదవ్, రవికాంత్ యాదవ్, వెంకటరమణ యాదవ్, పొచ్చన్న యాదవ్ పాల్గొన్నారు.

## నేడు కరంజిలో పంజ దర్శనం

కరంజిలో ఇమామ్ కాసీం

తాంసి(భీంపూర్), జూలై 14 : జిల్లాలో ప్రఖ్యాత మొహర్రం వేడుకల్లో ఒకటైన భీంపూర్ మండలం కరంజి(టీ)లో సోమవారం తెల్లవారుజామున కాసీం పంజ దర్శనం ఇవ్వనుంది. దీని కోసం పరిసర గ్రామాల నుంచి ప్రజలు తరలిరాగా వారికి కరంజి(టీ)లో ఏర్పాట్లు చేశారు. అలాగే ఆదివారం మలీద నైవేద్యం సమర్పణ పూర్తయింది. మొహర్రం కమిటీ వారు అన్ని ఏర్పాట్లు చేశారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఖానాపూర్‌రూరల్: మస్కాపూర్ ఉన్నత పాఠశాల 1994-95 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు

ఖానాపూర్ రూరల్, జూలై 14: ఖానాపూర్ మండలం మస్కాపూర్ గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం మొదటి బ్యాచ్ అయిన 1994-95 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అందరూ ఒక్కచోట చేరి చదువుకున్న రోజుల నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సంతోషంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు కల్వకుంట్ల నారాయణ, రాజ్‌కుమార్, రజాక్ బేగ్, కృష్ణ మూర్తి, నర్సయ్య, పెద్దన్న, గంగన్న, వెంకటేశ్వర్లును శాలువాలతో సన్మానించారు.

ఎదులాపురం, జూలై 14 : ఆదిలాబాద్ రూరల్ మండలం భీంసరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993-94 పదో తరగతి బ్యాచ్ పూర్వవిద్యార్థులు ఆదివారం పట్టణంలోని విద్యుత్ తరంగిణి హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి గురువులు కిష్టారెడ్డి, శంకరయ్య, మూర్తి,రంగన్న, శ్రీధర్, లతను శాలువాలతో సన్మానించి వారి ఆశీర్వాచనలు అందుకున్నారు. ముందుగా సరస్వతీ మాత చిత్రపటానికి పూలమాలలు వేసి వందేమాతరం గేయాన్ని ఆలపించారు. పూర్వవిద్యార్థులు నర్సింగ్, అడెల్లు, సంతోష్, స్వామి, అశోక్, పద్మ, కల్పన, సునీత, త్రిశుల, గంగమ్మ పాల్గొన్నారు.

కుంటాల, జూలై 14: కుంటాలలోని జడ్పీఎస్ఎస్‌లో1989-90 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. అందరూ కలిసి సహాపంక్తి భోజనాలు చేశారు. పాఠశాల ఆవరణలో ఫొటోలు దిగి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పాఠశాల పూర్వ విద్యార్థి ప్రస్తుతం స్కూల్ అసిస్టెంట్ అయిన బీ లక్ష్మణ్ రావు తన తండ్రి లింగారావు జ్ఞాపకార్థం పాఠశాల అభివృద్ధికి రూ.10వేలు అందజేశారు. పూర్వ ఉపాధ్యాయులు బీ కిషన్ రావు, సుదర్శన్, ఖాజా, రాజేశ్వర్, వేణుపతి పాల్గొన్నారు.

ఎదులాపురం: భీంసరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థులు




కుంటాల : జడ్పీఎస్ఎస్ 1989-90 బ్యాచ్ విద్యార్థులు

## ఐత్యారం ముచ్చట్లు కవి సమ్మేళనం

తాంసి(భీంపూర్), జూలై 14 : ఆదిలాబాద్‌లో ఆదివారం ఐత్యారం ముచ్చట్లు కవులు ఆన్‌లైన్ కవి సమ్మేళనం నిర్వహించారు. యువ కవులకు ప్రముఖ కవి డాక్టర్ ఉదారి నారాయణ పలు సూచనలు చేశారు. కవులు ఆయా అంశాలపై తమ కవితలు వినిపించారు. కొన్నేళ్లుగా ఆదిలాబాద్‌లో ప్రతి ఆదివారం సాయంత్రం ఈ కార్యక్రమం నిరవధికంగా కొనసాగుతండడం విశేషం. కవి సమ్మేళనంలో కవులు ఉదారి నారాయణ, బీ బాబన్న, కొండా సాయిప్రియ, నల్లగొండ రమేష్, లక్ష్మీనారాయణ, పులకిత, సామల వీరన్న పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నిర్మల్ అర్బన్, జూలై 14 : నిర్మల్‌లో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందని పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. గుల్జార్ మార్కెట్ ప్రాంతంలో వ్యక్తి మృతదేహం గమనించి స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. మృతుని వయస్సు 50 నుంచి 55 ఏళ్లు ఉంటుందని, లైట్ పింక్ కలర్ షర్ట్, బ్రౌన్ కలర్ ప్యాంటు ధరించి కుడిచేతి మణికట్టు వద్ద ఓం అని రాసి ఉందని పేర్కొన్నారు. మృతదేహం జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు సీఐ తెలిపారు. మృతిని వివరాలు తెలిసిన వారు పట్టణ పోలీసులను సంప్రదించాలన్నారు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## పీపీ యూనిట్ తనిఖీ

ఎదులాపురం, జూలై 14 : ఆదిలాబాద్ రిమ్స్‌లోని పీపీ యూనిట్ విభాగం ద్వారా చేపడుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆర్ఎంవో తొడసం చందు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శని, బుధవారాల్లో ప్రత్యేక శిబిరాలతో పాటు ప్రసూతి వార్డులో జన్మించిన శిశువులకు టీకాలు వేయాలన్నారు. అంతేకాకుండా వ్యాధినిరోధక టీకాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు.

## దాబాల్లో పోలీసుల దాడులు

భైంసా, జూలై 14: పట్టణంలోని భవాని, హన్సికాతో పాటు పలు దాబాల్లో ఆదివారం రాత్రి పోలీసులు దాడుల చేశారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ రాజారెడ్డి మాట్లాడుతూ దాబాలో ఎక్కడైనా మద్యం అమ్మకాలు జరిపితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ దాబాలలో దాడుల చేయగా 80 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకోగా దీని విలువ రూ. 40 వేల వరకు ఉంటుందన్నారు. ఆయన వెంట ఎస్ఐలు షరీఫ్, గౌస్, ఏఎస్ఐ సుదర్శన్ ఉన్నారు.

## బైంసాలో వర్షం

భైంసా, జూలై 14 : భైంసాలో శనివారం రాత్రి, ఆదివారం సైతం కురిసిన వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. భైంసాలో 9.4, కుభీర్‌లో 5.2, తానూర్‌లో 5.2, బాసరలో 1.4, ముథోల్‌లో 6.6, కుంటాలలో 7.6, లోకేశ్వరంలో 2.2. నర్సాపూర్(జీ)లో 4.2 మి.మి వర్షాపాతం నమోదైందని అధికారులు తెలిపారు.

## ఉచిత వైద్య శిబిరం

ఖానాపూర్ టౌన్, జూలై 14: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండడమే కాకుండా అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం అన్నారు. ఆదివారం ఖానాపూర్‌లోని ప్రభుత్వ గిరిజన బాలికల పాఠశాలలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యులు విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు షబ్బీర్ పాషా, సత్యసాయి సేవా సమితి సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పరామర్శ

నిర్మల్ అర్బన్, జూలై 14: నిర్మల్‌లోని ఇందిరానగర్ కాలనీలో గల సీనియర్ నాయకులు వీ సత్యనారాయణ గౌడ్‌కు ఇటీవల కాలికి గాయమైంది. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి తన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పాకాల రాంచందర్, నాలం శ్రీనివాస్, శ్రీకాంత్ యాదవ్, రాజారెడ్డి, విజయ్, శంకర్, భాస్కర్, నర్సయ్య ఉన్నారు.

## డీఎస్సీ అభ్యర్థులకు ప్రత్యేక సర్వీసులు

నిర్మల్ అర్బన్, జూలై 14: రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల18 నుంచి నిర్వహించే డీఎస్సీ పరీక్ష రాసే అభ్యర్థులకు నిర్మల్ డిపో నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ప్రతిమా రెడ్డి తెలిపారు. ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు ఉదయం 3 గంటలకు, రాత్రి 23.30 గంటలకు సూపర్ లగ్జరి బస్‌లను నడుపుతున్నామని అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా కాని, ఆర్టీసీ కౌంటర్‌లో ముందస్తు రిజర్వేషన్ చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ఘనంగా ఆషాఢ మాసం బోనాలు

కుంటాల: బోనం ఎత్తుకున్న ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

నిర్మల్ అర్బన్, జూలై 14: నిర్మల్‌లోని అన్ని వార్డుల్లో ఆదివారం భక్తులు ఆషాఢ మాసం బోనాలను అమ్మవారికి భక్తిశ్రద్ధలతో సమర్పించారు. శాంతినగర్, జర్నలిస్ట్ కాలనీ, దివ్యనగర్, ఏఎంఆర్ టవర్ కాలనీ, బంగల్‌పేట్, బాగులవాడ, బోయివాడ, ఆదర్శనగర్, చింతకుంటవాడ కాలనీలతో పాటు అన్ని వార్డుల్లో భక్తులు పోచమ్మ, మైసమ్మ, ఎల్లమ్మ, మారెమ్మ ఆలయాల్లోని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సకాలంలో వర్షాలు కురవాలని, పంటలు సంవృద్ధిగా పండాలని వేడుకున్నారు.

కుంటాల, జూలై 14 : కుంటాలలో మహాలక్ష్మీ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా బోనాల పండుగను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ హాజరై మహాలక్ష్మీ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకొని మహాలక్ష్మీ ఆలయం నుంచి ఊరేగింపుగా ప్రసిద్ధిగాంచిన గజ్జలమ్మ ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఉత్సవంలో జనగామ ఆర్టీవో శ్రీనివాస్ గౌడ్, మాజీ జడ్పీటీసీ ప్రకాశ్ గౌడ్, రమేశ్ గౌడ్, కృష్ణకాంత్ గౌడ్, సోమేశ్ గౌడ్, నాయకులు అప్క గజ్జారాం, జీవీ రమణ రావు, తదితరులు పాల్గొన్నారు.

కుభీర్, జూలై 14: కుభీర్‌తో పాటు వివిధ గ్రామాల్లోని గ్రామ దేవతలతో పాటు మహాలక్ష్మీ, దుర్గమ్మ ఆలయాలలో మహిళలు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు కురువాలని పాడి పంటలతో వర్ధిల్లాలని కోరుకున్నారు.

## ఉద్యోగోన్నతి పొందిన ఉపాధ్యాయులకు సన్మానం

ఉద్యోగోన్నతి పొందిన వారిని సన్మానిస్తున్న బృందం సభ్యులు

నిర్మల్ అర్బన్, జూలై 14 : విధి నిర్వహణలో బదిలీలు, ఉద్యోగోన్నతులు సహజమని పలువురు ఉపాధ్యాయులు అన్నారు. ఆదివారం నిర్మల్‌లో స్నేహ మిత్ర బృందం ఆధ్వర్యంలో ఇటీవల ఉద్యోగోన్నతి పొందిన నరేంద్రబాబు, మురళి, నరేందర్, అశోక్ రెడ్డి, ప్రవీణ్‌లను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో స్నేహ మిత్ర బృందం సభ్యులు పీజీ రెడ్డి, కేపీ రెడ్డి, సాయిరెడ్డి, రవికిరణ్, రాజేశ్వర్ రెడ్డి, సాయన్న పాల్గొన్నారు.

## వృద్ధులకు వన భోజనం

వన భోజనానికి తరలి వెళ్తున్న వృద్ధులు

నిర్మల్ అర్బన్, జూలై 14: నిర్మల హృదయ సేవా సమితి సభ్యులు డవ్ వృద్ధాశ్రమంలోని వృద్ధులను ఆదివారం వన భోజనానికి తీసుకెళ్లారు. పట్టణ శివారులోని నందిగుండం దుర్గామాత ఆలయ పరిసరాల్లో వన భోజనం ఏర్పాటు చేశారు. వృద్ధుకు ఎల్లప్పుడు అండగా ఉంటామని త్వరలోనే సినిమాకు తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు నార్లపురం రవీందర్, అధ్యక్షుడు శ్రీరాముల శ్రీనివాస్, సాయన్న, మూర్తిప్రభు, లక్ష్మణ్, చంద్రశేఖర్ వర్మ, శ్రీనిధి, సొసైటీ నాయకులు పద్మావతి, అన్నపూర్ణ, సుజాత, వృద్ధాశ్రమ నిర్వాహకులు రాము పాల్గొన్నారు.

## బంగారిగూడ ఘటనలో నలుగురి అరెస్టు

ఎదులాపురం, జూలై 14 : బంగారిగూడలోని దళిత కుటుంబ సభ్యులపై కులం పేరుతో దూషించి కర్రతో దాడి చేసి గాయపరిచిన నలుగురు ప్రధాన నిందితులను అరెస్టు చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు కేసు వివరాలను ఆదివారం వెల్లడించారు. పట్టణంలోని బంగారిగూడకు చెందిన మోరే సూర్యకాంత్ ఈ నెల 10వ తేదీన రాత్రి కాలకృత్యాలకు ఊరి బయటకు వెళ్తున్న క్రమంలో నలుగురు వ్యక్తులు అతడిని కులం పేరుతో దూషించారు. కుటుంబ సభ్యులను, అతడిని కర్రలతో కొట్టి గాయపరిచారు. అదే రోజు రాత్రి బాధితులు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాడికి పాల్పడిన వారిలోని ప్రధాన నిందితులు అమీర్‌ఖాన్, మోసిన్‌ఖాన్, సల్మాన్‌ఖాన్, షేక్‌ఫైజ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగింది. కాగా నిందితులకు వైద్య పరీక్షల అనంతరం కోర్టులో ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి 13రోజుల పాటు జ్యుడిషీయల్ రిమాండ్‌కు జిల్లా జైలుకు తరలించేందుకు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతో పాటు వివిధ సెక్షన్లలో కేసు నమోదు చేశారు.